# పిడుగుపాటుతో భార్యాభర్తల దుర్మరణం



**రెబ్బెన, మే 31, ప్రభాతవార్త:**

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలోని రెబ్బెన మండలంలోని కైరగూడ గ్రామంలో ఆదివారం రోజున అకాల వర్షానికి పిడుగు పోటుకు గురై భార్యాభర్త అక్కడికక్కడే దుర్మరణం చెందడం జరిగింది. మృతులు టేకం భీమ్రావు (45), టేకం రాజు భాయి (40) వివరాలు లోకి వెళ్తే మృతులు తిర్యానీ మండలం చెలిమెల గ్రామానికి చెందిన వారని బ్రతుకుతెరువు కోసం కైర్గుడా గ్రామానికి చెందిన ఒక రైతు దగ్గర పాలేరుగా జీవనం కొనసాగిస్తున్నారు. రోజువారీగా భాగంగానే పత్తి చేనులో సాయంత్రం వేళ పనికి వెళ్లడం జరిగింది. ఆకస్మిక వర్షానికి చెట్టు కింద చేరడంతో పిడుగుపాటుకు గురై అక్కడికక్కడే మృతి చెందడం జరిగింది. మృతులకు పిల్లలు లేరు. అందరితో కలిసిమెలిసి ఉండే దంపతులు ఆకస్మిక మరణం చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.విషయం తెలుసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


# ఆదిలాబాద్ వార్త



**మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్**

**సోమవారం 1, జూన్ 2026**


# సీఎం పర్యటనపై జిల్లా ప్రజల ఆశలు...





## ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు పెండింగ్ సమస్యలు పరిష్కారం అయ్యేనా?

**ఆసిఫాబాద్, మే 31, ప్రభాతవార్త :**

రాష్ట్ర ముఖ్యమంత్రి కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో నేడు పర్యటించనున్న నేపథ్యంలో ప్రజల్లో భారీ ఆశలు నెలకొన్నాయి. ముందుగా కేరమేరి మండలం కొలం కొరారి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవం, లబ్దిదారులతో ముఖాముచ అనంతరం కాఘజనగర్ ఎక్స్ రోడ్డు వద్ద నిర్వహించే బహిరంగ సభకు రోడ్డు మార్గం ద్వారా చేరుకుంటారు. దీనికి సంబంధిచిన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్, ఎస్పీ, ప్రజాప్రతినిధులు దగ్గరుండి పర్యవేశిస్తున్నారు. సభకు వచ్చే వారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తున్నారు.ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు, మౌలిక వసతుల సమస్యలు, కొత్త పరిశ్రమల ఏర్పాటు, ఉపాధి అవకాశాల కొరత వంటి అంశాలపై సీఎం స్పష్టమైన హామీలు ఇస్తారా? అనే చర్చ ప్రజల్లో సాగుతోంది.

2లో..



# ధాన్యం కొనుగోలు ప్రక్రియ నిబంధనల ప్రకారం చేపట్టాలి

**✦ కొనుగోలు కేంద్రాలను సందర్శించిన జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**చెన్నూరు, మే 31, ప్రభాతవార్త**



రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం చేపట్టిన కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు, నిల్వ, రవాణా ప్రక్రియలను నిబంధనల ప్రకారం సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంచిర్యాల జిల్లా చెన్నూర్ మండలంలోని ఓతుకులపల్లి, ఆస్నాద్, సోమనపల్లిలలో గల వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు, చెన్నూర్ మండల కేంద్రంలోని గోదామును మండల తహసిల్దార్ మల్లికార్జున్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర చెల్లించి రైతుల వద్ద నుండి నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేస్తుందని, కొనుగోలు ప్రక్రియను ఎలాంటి అవాంతరాలు లేకుండా పారదర్శకంగా, వేగంగా నిర్వహించాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు త్రాగునీరు, నీడ సౌకర్యాలు కల్పించడంతో పాటు గోనె సంచులు, టార్పాలిన్ కవర్లు, తూకం యంత్రాలు, ప్యాడీ క్లీనర్లను అందుబాటులో ఉంచాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాల నుండి వచ్చిన ధాన్యాన్ని గోదాములలో నిల్వ చేయాలని తెలిపారు. ధాన్యం నిల్వ, తరలింపులో ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, రైతులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. ప్రభుత్వం నిర్దేశిత సమయానికి అనుగుణంగా ధాన్యం ప్రక్రియను వేగవంతం చేయాలని, లక్ష్యాలను త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# సీఎం పర్యటన నేపథ్యంలో పటిష్ట భద్రతా ఏర్పాట్లు

**⁕ జిల్లా ఎస్పీ నితికా పంత్**

**కాగజ్‌నగర్ రూరల్, మే 31, ప్రభాతవార్త :**



కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో సోమవారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో విస్తృత భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ నితికా పంత్ తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన సజావుగా, ప్రశాంతంగా జరిగేందుకు సభాస్థలం, పార్కింగ్ ప్రదేశాలు, వీఐపీ ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, హెలిప్యాడ్ ప్రాంతం, ట్రాఫిక్ మార్గాలు తదితర ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. పర్యటన సందర్భంగా భద్రతా నిర్వహణ కోసం జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ బందోబస్తులో 2 మంది అదనపు ఎస్పీలు, 11 మంది డీఎస్పీలు, 44 మంది సీఐలు/ఆర్ఐలు, 157 మంది ఎస్ఐలు/ఆర్ఎస్ఐలు/డబ్ల్యూఎస్ఐలు, 200 మంది ఏఎస్ఐలు/హెడ్ కానిస్టేబుళ్లు, 829 మంది పోలీసు కానిస్టేబుళ్లు, 43 మంది మహిళా పోలీసు సిబ్బంది, 328 మంది హోంగార్డులు విధులు నిర్వహిస్తున్నారు.అదనంగా 9 ప్రత్యేక పార్టీలు, 2 రోప్ పార్టీలు, 28 యాక్సెస్ కంట్రోల్ బృందాలు, 10 బాంబ్ డిస్పోజల్ మరియు డాగ్ స్క్వాడ్ బృందాలను మోహరించినట్లు తెలిపారు. మొత్తం 1,825 మంది పోలీసు అధికారులు, సిబ్బంది ముఖ్యమంత్రి పర్యటన భద్రతా ఏర్పాట్లలో పాల్గొంటారని ఎస్పీ పేర్కొన్నారు.ప్రజలు పోలీసు శాఖకు సహకరించి, ట్రాఫిక్ మరియు భద్రతా నియమాలను పాటించాలని జిల్లా ఎస్పీ నితికా పంత్ విజ్ఞప్తి చేశారు.

# సీఎం పర్యటనపై జిల్లా ప్రజల ఆశలు..

(మొదటిపేజీ తరువాయి)

ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, తాగునీరు, సాగునీటి ప్రాజెక్టులు, ఆసుపత్రులు, విద్యా పరమైన కళాశాలలు, ఆలయాల అభివృద్ధి, నిరుద్యోగ సమస్యల పరిష్కారం కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారు. జిల్లాలో పలు సమస్యలు అధికారుల దృష్టికి వెళ్లినా ఇంకా పూర్తిస్థాయిలో పరిష్కారం కాలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని ఆడ, వట్టివాగు ప్రాజెక్ట్ కు మరమ్మతులు, జగన్నాథ్ పూర్ తో పాటు పలు ప్రాజెక్టులు నిధుల లేమితో నిలిచిపోగా, మరికొన్ని పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో సీఎం పర్యటన కీలకంగా మారింది.ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు సీఎం దృష్టికి స్థానిక సమస్యలను తీసుకెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. ముఖ్యంగా యువత ఉద్యోగ అవకాశాలు, రైతుల పంటలకు మద్దతు ధర, గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధి, ముఖ్యంగా ఎన్నో ఏళ్లుగా అసంపూర్తిగా ఉన్న గుండి, అన్నార్పల్లి, అప్పపల్లి వంతెన వంటి అంశాలపై నిర్ణయాలు వెలువడాలని కోరుతున్నారు. అదేవిధంగా రెబ్బన వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని అక్కడి ప్రజలు ఆశభావం వ్యక్తం చేస్తున్నారు. ఇక సీఎం పర్యటన సందర్భంగా కొత్త అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, పలు సంక్షేమ పథకాల ప్రారంభోత్సవాలు జరిగే అవకాశముందని అధికార వర్గాలు చెబుతున్నాయి. అయితే ప్రజలు మాత్రం "హామీలు కాకుండా అమలు కావాలి" అని స్పష్టం చేస్తున్నారు.సీఎం పర్యటనతో కుమురం భీం జిల్లాకు కొత్త ఊపొస్తుందా? పెండింగ్ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందా? అనే ప్రశ్నలకు సమాధానం రావాలంటే ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలు, వాటి అమలే కీలకంగా మారనున్నాయి.

# గ్రామాభివృద్ధికి కట్టుబడి ఉంటా... నల్లాల ఓదెలు

**- ఎర్రగుంటపల్లిలో బీరయ్య కామరది కళ్యాణ మహోత్సవం - ఆధ్యాత్మిక వేడుకల్లో పాల్గొన్న మాజీ విప్ నల్లాల ఓదెలు**

**మందమర్రి, మే 31, ప్రభాతవార్త**



మంచిర్యాల జిల్లా మందమర్రి మండలంలోని ఎర్రగుంటపల్లి గ్రామంలో నిర్వహించిన బీరయ్య కామరది కళ్యాణ మహోత్సవం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగింది. ఈ వేడుకలకు మాజీ చెన్నూరు శాసనసభ్యులు, మాజీ ప్రభుత్వ విప్ నల్లాల ఓదెలు ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. గ్రామ సంప్రదాయాలు, ఆచార వ్యవహారాల ప్రకారం నిర్వహించిన ఈ మహోత్సవంలో గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా మాజీ విప్ నల్లాల ఓదెలు మాట్లాడుతూ, ఎర్రగుంటపల్లి గ్రామ ప్రజల ఆత్మీయత, అభిమానమే తనకు ఎల్లప్పుడూ ప్రేరణగా నిలుస్తోందన్నారు. చెన్నూరు నియోజకవర్గ ప్రజలు, శ్రేయోభిలాషులు అందించిన ఆదరణ వల్లే ప్రజా జీవితంలో ఈ స్థాయికి చేరుకున్నానని పేర్కొన్నారు. ప్రజల సేవే తన లక్ష్యమని, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామ పెద్దలు, యువకులు మాజీ విప్ నల్లాల ఓదెలుకు ఘన స్వాగతం పలికి సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తులు, మహిళలు మరియు యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మందమర్రి ఏరియాలో ఘన వేడుకలు

**మందమర్రి, మే 31, ప్రభాతవార్త**

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని జూన్ 2వ తేదీన మందమర్రి ఏరియాలో ఘనంగా వేడుకలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా సంస్థ అభివృద్ధి, ఉత్పత్తి సాధనలో విశేష ప్రతిభ కనబరిచిన ఉత్తమ ఉద్యోగులను సన్మానించనున్నారు. ఈ ఏడాది మందమర్రి ఏరియా నుండి ఇద్దరు ప్రతిభావంతులైన ఉద్యోగులు ఉత్తమ పురస్కారాలకు ఎంపిక కావడం విశేషం. కార్పొరేట్ స్థాయి ప్రథమ ఉత్తమ ఉద్యోగి: కేకే ఓసీపీలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా విధులు నిర్వహిస్తున్న డి. సంతోష్ కుమార్ కార్పొరేట్ స్థాయి ప్రథమ ఉత్తమ ఉద్యోగిగా ఎంపికయ్యారు. ఆయన అందించిన విశిష్ట సేవలు, కృషికి గుర్తింపుగా ఈ పురస్కారం లభిస్తోంది. మందమర్రి ఏరియా స్థాయి ద్వితీయ ఉత్తమ ఉద్యోగి: కాసిపేట02 ఇంక్లైన్‌లో ఎస్.డి.ఎల్/ఎల్.హెచ్.డి ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న బి. రాజ్‌కుమార్ ఏరియా స్థాయి ద్వితీయ ఉత్తమ ఉద్యోగిగా ఎంపికయ్యారు. గనిలో ఆయన ప్రదర్శించిన నిబద్ధత, పనితీరు ప్రశంసనీయం. జూన్ 2న జరిగే తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో ఏరియా ఉన్నతాధికారుల సమక్షంలో వీరికి పురస్కారాలను అందజేసి ఘనంగా సన్మానించనున్నారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీతలకు సహోద్యోగులు, అధికారులు ముందస్తుగా అభినందనలు తెలియజేశారు.

## మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య జన్మదిన వేడుకలు

**- ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ**

**వేమనపల్లి, ప్రభాతవార్త**



బెల్లంపల్లి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య జన్మదినాన్ని పురస్కరించుకుని వేమనపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. వేమనపల్లి మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కోళి వేణుమాధవ్ రావు ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కుబిడే మధుకర్, పీఏసీఎస్ చైర్మన్ కుబిడే వెంకటేశం పాల్గొని రోగులకు పండ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిగురాల లక్ష్మణ్, బెల్లంపల్లి నియోజకవర్గ యువ నాయకుడు ఇరుగురాల రజోక్, బీఆర్ఎస్ నాయకులు గుండయ్య, వార్డు సభ్యులు పూర్సింగ అంజన్న, తోకల శ్రీకాంత్, చిగురాల రవి, నరేష్, వెంకటి, రవి తదితరులు పాల్గొన్నారు.

## కాకా వెంకటస్వామి - కళావతమ్మ స్మారక సేవా యజ్ఞం

**- రెండు నెలలుగా పేదలకు అన్నదానం చేసిన బండి సదానందం**

**- కాకా ఆశయాలు - సదానందం కార్యాచరణ...**

**- ప్రజల కోసం నిరంతర సేవలో కాంగ్రెస్ నాయకుడు బండి**

**మందమర్రి, మే 31, ప్రభాతవార్త**

స్వర్గీయ కాకా వెంకటస్వామి, కళావతమ్మ దంపతుల స్మారకార్థం చేపడుతున్న సేవా కార్యక్రమాలకు ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు బండి సదానందం యాదవ్ తెలిపారు. మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణ కేంద్రంలో ఆయన ఆధ్వర్యంలో గత రెండు నెలలుగా నిరంతరంగా కొనసాగుతున్న సేవా కార్యక్రమాలు ఆదివారం నాటికి విజయవంతంగా రెండు నెలలు పూర్తి చేసుకున్నాయి. ఈ సందర్భంగా ప్రత్యేకంగా పేదలు, నిరుపేదలు, కూలీ కార్మికులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని అన్నదానాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా బండి సదానందం యాదవ్ మాట్లాడుతూ, స్వర్గీయ కాకా వెంకటస్వామి, కళావతమ్మ ప్రజాసేవకు ప్రతీకలని, వారి సేవా స్ఫూర్తిని కొనసాగించే ఉద్దేశంతో ఈ కార్యక్రమాలను ప్రారంభించామని తెలిపారు. ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామ్యం కావడం, అవసరమైన వారికి తోడ్పాటును అందించడం తమ బాధ్యతగా భావిస్తున్నామని పేర్కొన్నారు. ప్రతి రోజు పట్టణంలో ప్రయాణికులు, కార్మికులు, ప్రజల కోసం ఉచితంగా మంచినీటి పంపిణీ నిర్వహిస్తున్నామని, ప్రతి బుధవారం మజ్జిగ పంపిణీ, ప్రతి ఆదివారం పెరుగు అన్నం పంపిణీ కార్యక్రమాలను క్రమం తప్పకుండా కొనసాగిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమాలకు ప్రజల నుంచి వస్తున్న స్పందన తమకు మరింత ఉత్సాహాన్ని కలిగిస్తోందన్నారు. సామాజిక సేవే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని, జూన్ నెలాఖరు వరకు ఈ సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. పేద ప్రజలకు సేవ చేయడమే తన ప్రధాన ధ్యేయమని, ప్రజల ఆశీస్సులతో భవిష్యత్తులో కూడా మరిన్ని సేవా కార్యక్రమాలను చేపడతానని వెల్లడించారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో మందమర్రి పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ బండి సదానందం యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు.



## కాంగ్రెస్ సేవాదళ్ ఆధ్వర్యంలో జాతీయ పతాకోత్సవం

**- దేశ సమైక్యతకు ప్రతీకగా జాతీయ పతాకావిష్కరణ**

**- దేశభక్తి నినాదాలతో కాంగ్రెస్ సేవాదళ్ కార్యక్రమం**

**మందమర్రి, మే 31, ప్రభాతవార్త**

మందమర్రి పట్టణం పాత బస్టాండ్ ఏరియాలో జాతీయ పతాక ఆవిష్కరణ పట్టణ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ఎగురవేశారు. అచల భారత కాంగ్రెస్ సేవాదళ్ ఆధ్వర్యంలో ప్రతి నెల చివరి ఆదివారం నిర్వహించే జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమంలో భాగంగా మందమర్రి పట్టణంలో ఘనంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. స్థానిక పాత బస్టాండ్ ఫ్లైఓవర్ సమీపంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మందమర్రి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మంద తిరుమల్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఎగురవేసి దేశభక్తి భావాన్ని చాటారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశ సమైక్యత, జాతీయ సమగ్రతను కాపాడుకోవడం ప్రతి భారత పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. కాంగ్రెస్ సేవాదళ్ దేశభక్తి, సేవా భావం, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. యువతలో దేశభక్తి భావాలను పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని అన్నారు. కార్యక్రమానికి కాంగ్రెస్ సేవాదళ్ మందమర్రి పట్టణ అధ్యక్షుడు సొతుకు ఉదయ్ అధ్యక్షత వహించారు. అనంతరం జాతీయ జెండాకు వందనం చేసి దేశభక్తి నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు హఫీజ్, మాజీ పట్టణ అధ్యక్షుడు నోముల ఉపేందర్ గౌడ్, సీనియర్ నాయకుడు సొతుకు సుదర్శన్, సేవాదళ్ ఉపాధ్యక్షుడు ఆలం శంకర్, కార్యదర్శి శివకృష్ణ, పట్టణ నాయకులు వనం నర్సయ్య, బుర్ర ఆంజనేయులు, రాచర్ల గణేష్, బేర వేణుగోపాల్, కొక్కుల మధు, మైనారిటీ నాయకుడు చోటే మియా, కాంగ్రెస్ నాయకులు ఎర్ర రాజు, ఎండి. షరీఫ్, మంకు రమేష్, రంజిత్ గౌడ్, రాం రాజేష్, పానుగంటి లక్ష్మణ్, సోషల్ మీడియా ఇన్‌ఛార్జ్ ముడారపు శేఖర్, యువ నాయకులు మాయ తిరుపతి, రాయబారపు కిరణ్, ఓరుగంటి సురేందర్, వడ్లూరి సునీల్, కిరణ్, సతీష్, శ్రావణ్, రిత్విక్ తదితరులు పాల్గొన్నారు.

## ఇండియన్ ఆర్మీకి ఎంపికైన చౌదరి అంజన్న

**- వ్యవసాయ కూలీల కుమారుడి విజయంతో గ్రామంలో హర్షం**

**వేమనపల్లి, మే 31, ప్రభాతవార్త**



మండలంలోని కేతనపల్లి గ్రామానికి చెందిన యువకుడు చౌదరి అంజన్న(18) ఇండియన్ ఆర్మీకి ఎంపికై గ్రామానికి, కుటుంబ సభ్యులకు గర్వకారణంగా నిలిచాడు. చిన్ననాటి నుంచే దేశ సేవ చేయాలనే లక్ష్యంతో కృషి చేసిన అంజన్న ఇటీవల నిర్వహించిన ఎంపిక ప్రక్రియలో ప్రతిభ కనబర్చి భారత సైన్యంలో చోటు సంపాదించాడు. అంజన్న తల్లిదండ్రులు చౌదరి వెంకటేష్, జ్యోతి వ్యవసాయ కూలీలుగా పనిచేస్తూ, ఇటుక పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. సాధారణ కుటుంబ నేపథ్యం నుంచి వచ్చిన అంజన్న 10వ తరగతి వరకు నీల్వాయిలో విద్యాభ్యాసం చేసి, ప్రస్తుతం పెద్దపల్లిలో డిప్లొమా కోర్సు చదువుతున్న క్రమంలోనే ఇండియన్ ఆర్మీకి ఎంపిక కావడం విశేషం. అంజన్న విజయం పట్ల కుటుంబ సభ్యులు, గ్రామస్థులు, స్నేహితులు హర్షం వ్యక్తం చేశారు. కష్టపడి చదివి, పట్టుదలతో లక్ష్యాన్ని సాధించిన అతడు యువతకు ఆదర్శంగా నిలిచాడని కొనియాడారు. ఈ సందర్భంగా పలువురు అతనికి అభినందనలు తెలియజేస్తూ దేశ సేవలో ఉత్తమంగా రాణించి మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.



నాయకులతో కలిసి వీక్షిస్తున్న ప్రజా ట్రస్ట్ చైర్మన్ మోహన్‌రావు పాటిల్

## 134వ "మన్ కీ బాత్" కార్యక్రమంలో పాల్గొన్న ప్రజా ట్రస్ట్ చైర్మన్ మోహన్‌రావు పాటిల్

**భైంసా, మే 30, ప్రభాతవార్త**

భైంసా పట్టణంలోని జిన్నింగ్ అండ్ ప్రెస్సింగ్ ఫ్యాక్టరీలో నిర్వహించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 134వ "మన్ కీ బాత్" రేడియో కార్యక్రమాన్ని ప్రజా ట్రస్ట్ చైర్మన్, ముధోల్ నియోజకవర్గ బీజేపీ నాయకుడు మోహన్‌రావు పాటిల్ వీక్షించారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు ప్రజా ట్రస్ట్ లైబ్రరీ విద్యార్థులు ఎంతో ఆసక్తిగా పాల్గొని ప్రధాని ప్రసంగాన్ని విన్నారు. ఈ సందర్భంగా మోహన్‌రావు పాటిల్ మాట్లాడుతూ ప్రధానమంత్రి ఇచ్చే సందేశాలు దేశ సంస్కృతిని కాపాడటానికి, సమాజ ప్రగతికి, యువతలో సరికొత్త స్ఫూర్తిని నింపేందుకు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలోని మంచి విషయాలను స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. ప్రజలు ఇటువంటి అవగాహన కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు, విద్యార్థులు, స్థానికులు పాల్గొన్నారు.



## జొన్నల గోదాంను ప్రారంభించిన మార్కెట్ చైర్మన్

**సారంగాపూర్, మే 31, ప్రభాతవార్త:**

సారంగాపూర్ మండలంలోని బీరవెల్లి గ్రామంలో గల శ్రీరామ్ సాయిబాబా మందిర ప్రాంగణంలోని గోదాంను జొన్నల నిల్వ కొరకు మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్ ఆది ఆదివారం పరిశీలించి, ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో జొన్నల కొనుగోళ్లు ప్రారంభమయ్యాయని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పంటను భద్రపరచడానికి ఈ ప్రత్యేక గోదాంను అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొన్నారు. రైతులు తమ జొన్న పంటను కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకుని మద్దతు ధరను పొందాలని సూచించారు. అధికారులు, మార్కెట్ సిబ్బంది కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు భూమారెడ్డి, రాజేశ్వర్, రమేష్, రాజు, రామ్‌రెడ్డితో పాటు రైతులు ప్రవీణ్ రెడ్డి, సాయన్న, లింగారెడ్డి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి పర్యటను విజయవంతం చేయాలి

### - ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

**కెరిమెరి, మే 31, ప్రభాతవార్త**



జూన్ 1న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటనను విజయవంతర్ చేయాలని మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు ఈ సందర్భంగా ప్రభుత్వం చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవ ఏర్పాట్లను పరిశీలించేందుకు మంచిర్యాల ఎమ్మెల్యే కెరమెరి మండలంలోని కొత్తగూడ, గ్రామాలలో ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా సభా ప్రాంగణం, వేదిక నిర్మాణం, ప్రజలకు కల్పించాల్సిన సౌకర్యాలు, పార్కింగ్ ఏర్పాట్లు తదితర అంశాలను ఎమ్మెల్యే పరిశీలించి అధికారులకు తగిన సూచనలు చేశారు. ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం అయ్యేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆయన ఆదేశించారు. అభివృద్ధి కార్యక్రమాల ద్వారా ప్రజలకు మరిన్ని సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని ఎమ్మెల్యే తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు మరియు పార్టీ నాయకులు ఈ పరిశీలన కార్యక్రమంలో పాల్గొన్నారు.

# సీఎం పర్యటన విజయవంతం చేయాలి

**ఆసిఫాబాద్, మే 31, ప్రభాతవార్త**

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని అటవీ శాఖ గెస్ట్ హౌస్ లో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఎమ్మెల్సీ దండే విట్టల్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ అనిల్, డిసిసి అధ్యక్షురాలు సుగుణ, ఆసిఫాబాద్ నియోజకవర్గ ఇన్చార్జి శ్యామ్ నాయక్, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటిసారిగా జిల్లాకు వస్తున్న సీఎంకు ఘనస్వాగతం పలికేందుకు ఘనంగా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇంద్రవెల్లిలో నిర్వహించిన సభను తలపించేలా సభ నిర్వహించనున్నట్లు, లక్ష మందిని ఉమ్మడి జిల్లా నుండి తీసుకురావడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. మేనిఫెస్టోలో పెట్టిన ప్రతి హామీ నెరవేర్చుమని, ప్రతిపక్ష బిఆర్ఎస్ నాయకులు అనవసర ఆరోపణలు చేస్తున్నారన్నారు. జిల్లాలో ఆదివాసుల సమస్యలు పరిష్కరించడానికి కట్టుబడి ఉన్నామని, ఇందిరమ్మ ఇండ్లు కాకుండా ప్రత్యేకంగా పిటిజిలకు అదనపు ఇండ్లను మంజూరు చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలో రాష్ట్ర ఆవిర్భావం కంటే ముందు కాంగ్రెస్ హయాంలో ప్రారంభించిన కొమరం భీమ్, జగన్నాథ్ పూర్, వట్టివాగు, ఎర్రవాగు ప్రాజెక్టులకు తట్టెడు మట్టి కూడా గత ప్రభుత్వం పోయలేదని విమర్శించారు. కొమరం భీం ప్రాజెక్టు వర్షాకాలం తర్వాత పూర్తిస్థాయిలో మరమ్మత్తులు చేస్తామన్నారు. కుడి కాలువ నిర్మాణంతో 60 గ్రామాలకు, ఎడమ కాలువను సిర్పూర్ నియోజకవర్గం వరకు విస్తరించడంతో మరిన్ని గ్రామాలకు నీరు అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వట్టి వాగు ప్రాజెక్టుకు 13 కోట్లు కేటాయించినట్లు గుర్తు చేశారు. రైతు సంక్షేమం దిశగా ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని దీనిలో భాగంగా పంటకు నీరు, పండిన పంటకు మద్దతు ధర ఇవ్వడం లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ మానస పుత్రిక ఉపాధి హామీ పథకాన్ని బిజెపి భ్రష్టు పట్టించిందన్నారు. 60 కేంద్రం 40 రాష్ట్రం ఇవ్వాలంటూ కొత్త నిబంధనలు తెచ్చి కూలీలకు ఇబ్బందులు కలిగేలా చేస్తుందన్నారు. ఆదిలాబాద్ ఎక్స్ రోడ్డు నుండి ఉట్నూరు వరకు నాలుగు వరుసల రహదారి మంజూరుకు, గుండి, అనార్పల్లి బ్రిడ్జిలకి నిధుల కోసం ముఖ్యమంత్రిని ఒప్పిస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి సభ సక్సెస్ అయితే జిల్లాకు అభివృద్ధి నిధులు మంజూరు కావడం సులభం అవుతుందని క్షేత్రస్థాయిలో ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రతిపక్షాలు ఉనికి కోసం పోరాటం చేస్తున్నాయని, 2029 ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని, 100 సీట్లు గెలవడం లక్ష యంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో తెల్ల రేషన్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ భరోసా కింద ఇన్సూరెన్స్ అమలు చేయనున్నట్లు దీనికిగాను ముఖ్యమంత్రి సభలో ప్రకటన వచ్చే అవకాశం ఉన్నట్లు తెలిపారు. ఇది అమలయితే ప్రతి పేదవాడికి ఏ విధంగా మృతిచెందినా ఇన్సూరెన్స్ వర్తిస్తుందన్నారు. నేటి సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు తారీక్, మాజీ ఎంపీపీ బాలేష్ గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లేష్, నాయకులు శంకర్, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాతున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్

## మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య జన్మదిన సందర్భంగా అన్నదానం

**బెల్లంపల్లి, మే 31, ప్రభాతవార్త**

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలోని కాంట చౌరస్తా పల్లెటూరి బస్టాండ్ ప్రాంతంలో అమ్మ ఒడి ఎన్‌జీఓ అన్నదాత ప్రాజెక్ట్ మరియు టెక్నో డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది. ప్రతి ఆదివారం నిరంతరంగా ఆకలితో ఉన్నవారికి ఆహారం అందించాలనే సదుద్దేశంతో 05-04-2020న ప్రారంభమైన ఈ కార్యక్రమం భాగంగా, ఈ రోజు 387వ వారానికి చేరుకుంది. బెల్లంపల్లి పట్టణంలో యాచకులు, నిరుపేదలు, దినసరి కూలీలు, బాటసారులు వంటి సుమారు 200 మందికి అన్నదానం నిర్వహించారు. ఈ రోజు కార్యక్రమం బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య జన్మదినాన్ని పురస్కరించుకొని సానా శ్రావణ్, కొట్టె వినయ్, కొట్టె రాకేష్ వారి సహకారంతో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా అమ్మ ఒడి అన్నదాత ప్రాజెక్ట్ వ్యవస్థాపకులు అజ్మీరా మోహన్ (మంచిర్యాల జిల్లా బ్రాంచ్ మేనేజర్) మరియు టెక్నో డాన్స్ అకాడమీ గ్రాండ్ మాస్టర్ హనుమాండ్ల మధుకర్ మాట్లాడుతూ ఆకలితో ఉన్నవారికి ఆహారం అందించడం ఎంతో ఆనందాన్ని కలిగిస్తుందని తెలిపారు. 387 వారాలుగా నిరంతరంగా ఈ సేవ కొనసాగించడం గర్వకారణమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బి.ఆర్.ఎస్ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు, అమ్మ ఒడి సభ్యులు హనుమాండ్ల సువర్ణ, గన్నేవరం తిరుమలాచారి, చెందుపట్ల లింగమూర్తి, ఎం.డి. యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.



## జిల్లాలో 30 పోలీస్ యాక్ట్ అమలు

**ఆసిఫాబాద్, మే 31, ప్రభాతవార్త**

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జూన్ 1న కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీస్ యాక్ట్30 అమలులో ఉన్నట్లు జిల్లా ఎస్పీ నితికా పంత్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన సజావుగా, ప్రశాంతంగా జరిగేలా జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టిందని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా బాణాసంచా కాల్చడం, ప్రజా శాంతికి భంగం కలిగించే చర్యలకు పాల్పడడం చట్టవిరుద్ధమని హెచ్చరించారు. పోలీస్ యాక్ట్ 30 నిబంధనలను ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ స్పష్టం చేశారు. ప్రజలు పోలీస్ శాఖకు సహకరించి శాంతియుత వాతావరణం నెలకొనేలా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆమె కోరారు.



లోనవెల్లి వారసంతలో ప్రజలకు అంబలి పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

## లోనవెల్లి వారసంతలో అంబలి పంపిణీ చేసిన మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

**స్పిర్పూర్(టి), మే 31, ప్రభాతవార్త:**

మండలంలోని లోనవెల్లి గ్రామంలో ఆదివారం నిర్వహించిన వారసంతలో మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అంబలి పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో వారసంతకు దూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలు, రైతులు, వ్యాపారులకు దాహార్తి తీర్చేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆయన తెలిపారు. వేసవి కాలంలో శరీరానికి చల్లదనాన్ని అందించే అంబలిని ప్రజలకు అందించడం ఆనందంగా ఉందని కోనప్ప పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యం, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని అన్నారు. వారసంతకు వచ్చిన ప్రజలు అంబలి సేవించి నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగభూషణ్, ప్రశాంత్, లచ్చన్న, వెంకన్నతో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# నేడు కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాకు సీఎం రేవంత్‌రెడ్డి

**- రూ.112.14 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు**

**- విద్యుత్ మౌలిక సదుపాయాలు, సౌర విద్యుత్ ప్రాజెక్టు, మున్సిపల్ అభివృద్ధి పనులకు శ్రీకారం**

**కెరమెరి, మే 31, ప్రభాతవార్త**

ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి సోమవారం కుమ్రం భీంఆసిఫాబాద్ జిల్లాలో పర్యటించనున్నారు. జిల్లాలో చేపట్టనున్న పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ముఖ్యమంత్రి శంకుస్థాపనలు, ప్రారంభోత్స వాలు చేయనున్నారు. మొత్తం రూ.112.14 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు సీఎం శ్రీకారం చుట్టనున్నారు. ఈ పర్యటనలో భాగంగా చింతలమానేపల్లి మండలంలోని కౌటాల (రవీంద్రనగర్ క్యాంపు నం2) గ్రామంలో ఏర్పాటు చేయనున్న 132/33 కేవీ విద్యుత్ ఉపకేంద్రం నిర్మాణ పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నారు. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.56.55 కోట్లు. రెబ్బెన మండలం నాంబాల్ గ్రామంలో రూ.6 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేయనున్న సౌర విద్యుత్ ప్లాంట్ పనులకు కూడా సీఎం శంకుస్థాపన చేయనున్నారు. అదే విధంగా చింతలమానేపల్లి, గుడ్లబోరి, కాపువాడ, చింతకుంట, అంకుషాపూర్ ప్రాంతాల్లో నిర్మించనున్న 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రాల పనులకు కూడా ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టనున్నారు. ఈ ఉపకేంద్రాల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా మరింత బలోపేతం కావడంతో పాటు వ్యవసాయం, పరిశ్రమలు, గృహ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందుబాటులోకి రానుంది. జిల్లాలోని ఆసిఫాబాద్ మున్సిపాలిటీలో రూ.15 కోట్లతో చేపట్టనున్న తొమ్మిది అభివృద్ధి పనులు, కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో రూ.18.70 కోట్లతో చేపట్టనున్న ఎనిమిది అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపనలు, ప్రారంభోత్స వాలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాల ద్వారా జిల్లాలో విద్యుత్ మౌలిక సదుపాయాల విస్తరణ, పునరుత్పాదక ఇంధన వినియోగ ప్రోత్సాహం, పట్టణ మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి జూపల్లి తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఏర్పాట్లు పూర్తయ్యాయని చెప్పారు.



## వ్యవసాయ విస్తరణ అధికారిణి రోక్సర్ సుల్తానా బదిలీ

**వేమనపల్లి, మే 31, ప్రభాతవార్త**



వేమనపల్లి క్లస్టర్‌లో వ్యవసాయ విస్తరణ అధికారిణిగా విధులు నిర్వహించిన రోక్సర్ సుల్తానా బదిలీపై కోటపల్లి మండల వ్యవసాయ విస్తరణ అధికారిణిగా వెళ్లారు. వేమనపల్లిలో విధులు నిర్వహించిన కాలంలో రైతులకు వ్యవసాయ సంబంధిత సలహాలు, సూచనలు అందిస్తూ సేవలందించారు. ఈ సందర్భంగా రోక్సర్ సుల్తానా మాట్లాడుతూ విధుల నిర్వహణలో తనకు సహకరించిన రైతులు, ప్రజాప్రతినిధులు, వ్యవసాయ శాఖ సిబ్బంది, పత్రికా మిత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. వేమనపల్లి ప్రజలు చూపిన ఆదరణను ఎప్పటికీ మరువలేనని పేర్కొన్నారు. అలాగే కోటపల్లి మండలంలో కూడా రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని ఆమె తెలిపారు.

## జిల్లా వ్యాప్తంగా రేపటి నుంచి 30 పోలీస్ యాక్ట్ అమలు

**భైంసా, మే 31, ప్రభాతవార్త:**



నిర్మల్ జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రశాంత వాతావరణం పెంపొందించేందుకు జూన్ 1 నుండి జూన్ 30 వరకు జిల్లా అంతటా 30 పోలీస్ యాక్ట్ 1861 అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ డాక్టర్ జి.జానకి షర్మిల ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా ఉత్తర్వుల ప్రకారం ఈ నిబంధనలు వర్తిస్తాయని పేర్కొన్నారు. ముందస్తు అనుమతి లేకుండా ప్రజా బహిరంగ కార్యక్రమాలు, సభలు, ర్యాలీలు నిర్వహించడం పూర్తిగా నిషేధమని స్పష్టం చేశారు. ఈ చట్టం అమలులో ఉన్నందున జిల్లాలో సబ్ డివిజనల్ పోలీస్ అధికారి (డీఎస్పీ) లేదా పోలీస్ ఉన్నతాధికారుల ముందస్తు అనుమతి లేకుండా ఎటువంటి పబ్లిక్ మీటింగులు, ఊరేగింపులు, ధర్నాలు, రాస్తారోకోలు చేపట్టరాదని తెలిపారు. అలాగే కత్తులు, చాకులు, కర్రలు, జెండా కర్రలు, దుడ్డుకర్రలు, తుపాకులు, పేలుడు పదార్థాలు, నేరానికి పురిగొల్పే ఎలాంటి నిషేధిత ఆయుధాలను వెంట ఉంచుకోరాదని, వాడరాదని హెచ్చరించారు. ప్రజలకు ఇబ్బంది, చిరాకు కలిగించేలా జనసమూహాలు పోగుకావడం, రాళ్లను జమ చేయడం, లౌడ్ స్పీకర్లు, డీజేలు ఏర్పాటు చేయడం వంటివి కూడా ఈ సమయంలో నిషేధించడమైందని వివరించారు. ఈ నియమాలను ఎవరైనా ఉల్లంఘిస్తే 30 పోలీస్ యాక్ట్ 1861 కింద కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ పేర్కొన్నారు.

## గాలివాన బీభత్సం..

**- విద్యుత్ షాక్‌తో మూడు మేకలు మృతి**

**- బాధిత కుటుంబానికి సాయం భరోసా**

**బెల్లంపల్లి, మే 31, ప్రభాతవార్త**



బెల్లంపల్లి మున్సిపాలిటీ 13వ వార్డ్ పరిధిలోని గొల్లగూడెంలో ఆదివారం రోజున సాయంత్రం సమయంలో కురిసిన భారీ గాలివర్షం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. బలమైన ఈదురుగాలులకు ఒక విద్యుత్ స్థంభం విరిగి పడటంతో, కరెంట్ వైర్లు నేలపైకి వచ్చాయి. ఆ సమయంలో అక్కడ ఉన్న చిప్ప గట్టయ్య మూడు మేకలు విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాయి. ఈ ఘటన విషయం తెలుసుకున్న వెంటనే స్థానిక మున్సిపల్ కౌన్సిలర్ రాజ్ కుమార్ యాదవ్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. వెంటనే విద్యుత్ శాఖ అధికారులను, వెటర్నరీ సిబ్బందిని పిలిపించి పంచనామా నిర్వహింపజేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం ద్వారా తగిన ఆర్థిక సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని, వారికి పూర్తి మద్దతు ఉంటుందని కౌన్సిలర్ భరోసా ఇచ్చారు. స్థానికులు కూడా ఈ ఘటనపై ఆందోళన వ్యక్తం చేస్తూ, ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్థంభాలు, వైర్లపై వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను కోరుతున్నారు.

## ట్రిపుల్ ఐటీకి ప్రభుత్వ పాఠశాల బాలికలు

**లక్షెట్టిపేట, మే 31, ప్రభాతవార్త**





లక్షెట్టిపేట ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు బాసర ట్రిపుల్ ఐటీ సీట్లు సాధించినట్లు ఎంఈవో, హెచ్ఎం శైలజ తెలిపారు. పదో తరగతిలో ఉత్తీర్ణులైన మాటేటి రిషిక, మేడి తిరుమల అడ్మిషన్ల జాబితాలో స్థానం పొందారన్నారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి మాట్లాడుతూ.. నిన్న ప్రకటించిన ట్రిపుల్ ఐటీ బాసర రిజల్ట్ నందు ఇద్దరు విద్యార్థులు ఎంపిక కావడం మా ప్రభుత్వ పాఠశాలకు గర్వకారణం అని కొనియాడారు. ఈ సందర్భంగా వారికి ప్రోత్సహించిన ఉపాధ్యాయులను అభినందించారు. అనంతరం ఎంపికైన విద్యార్థినులను హెచ్ఎం శైలజతో పాటు పలు పాఠశాలల ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో మంచి పేరు సంపాదించాలని కోరారు. తల్లిదండ్రులు వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలను చదివించాలని కోరారు.

## సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ ఉత్తమ ఉద్యోగుల ఎంపిక

**జైపూర్, మే 31, ప్రభాతవార్త**





తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ నుండి ఇద్దరు ఉత్తమ ఉద్యోగులను ఎంపిక చేశారు. ఎలక్ట్రికల్ విభాగంలో ఎస్.ఈగా విధులు నిర్వహిస్తున్న కే. ప్రసాద్, ఉత్తమ అధికారిగా, పర్చేజ్ విభాగంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న రాజు ఉత్తమ ఉద్యోగిగా ఎంపికయ్యారు. కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియంలో జరగబోయే సెంట్రల్ ఫంక్షన్‌లో సింగరేణి సి అండ్ ఎం.డి డాక్టర్ బుద్ధ ప్రకాష్ జ్యోతి, సింగరేణి డైరెక్టర్ల చేతుల మీదుగా ప్రసాద్ సన్మానం పొందనున్నారు. జైపూర్ మండల కేంద్రంలో జరగబోయే తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలలో ఉత్తమ ఉద్యోగి రాజు వీరిని ఎస్టీపిపిలో జరగబోయే వేడుకలలో ఈ.డి చిరంజీవి, జిఎం నరసింహారావు, జి.ఎం మదన్మోహన్‌ల చేతుల మీదుగా సన్మాన, సత్కారాలు అందుకోనున్నారు. ఈ సందర్భంగా ఈ.డి. చిరంజీవి , జి.ఎం నరసింహారావు, జిఎం మదన్మోహన్‌లు ఉత్తమ ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపారు.

## స్కూటీ, బైక్ ఎదురెదురుగా ఢీ ఒకరు మృతి

**లక్షెట్టిపేట, మే 31, ప్రభాతవార్త**



లక్షెట్టిపేట మండలం శాంతాపూర్ జాతీయ రహదారిపై నిన్న రాత్రి టీవీఎస్ రైడర్ బైక్, స్కూటీ ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో బైక్ పై ప్రయాణిస్తున్న సత్యసాయి నగర్‌కు చెందిన గుర్రాల ప్రశాంత్ అనే 22 సంవత్సరాల యువకుడు మృతి చెందినట్లు ఎస్ఐ గోపతి సురేష్ తెలిపారు. మృతుడు నిన్న ఉదయం తన బైక్ పై మంచిర్యాలకు వెళ్లి అక్కడ పని ముగించుకుని రాత్రి 9 గంటలకు ఇంటికి వస్తుండగా ఎదురుగా వస్తున్న స్కూటీ ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా గాయపడ్డ ప్రశాంత్ మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ రాత్రిపూట మృతి చెందాడు. మృతుని చిన్నాన గుర్రాల రవీందర్ ఫిర్యాదు మేరకు స్కూటీ నడుపుతున్న వ్యక్తిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేయడం జరుగుతుందని ఎస్ఐ గోపతి సురేష్ తెలిపారు.

## భక్తి శ్రద్ధలతో ఋష్యమూక బాలాజీ పర్వతం గిరి ప్రదక్షిణ

**- చైర్‌పర్సన్ డాక్టర్ గొడిసెల సంధ్యారాణి**

**క్యాతన్‌పల్లి, మే 31,ప్రభాతవార్త**

భక్తి శ్రద్ధలతో పవిత్ర ఋష్యమూక బాలాజీ పర్వతం గిరిప్రదక్షిణ మహోత్సవంలో క్యాతనపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ గొడిసెల సంధ్యారాణి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకున్నారు. రాష్ట్రం, జిల్లా క్యాతనపల్లి ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం స్వామివారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని కోరారు. గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులతో కలిసి ఆమె పర్వత ప్రదక్షిణ నిర్వహించి ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భక్తుల విశ్వాసానికి ప్రతీకగా నిలిచిన గిరి ప్రదక్షిణకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారని అన్నారు. గోవింద నామస్మరణల మధ్య స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ, ఆధ్యాత్మిక వాతావరణంలో భక్తులు పూజా క్రతువులు నిర్వహించడం విశేషంగా ఆకట్టుకుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బొక్కలగుట్ట సర్పంచ్ మాసు శ్రీనివాస్, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ మిట్టపల్లి సరిత, భక్తులు పాల్గొన్నారు.



## ఆరోగ్య పథకం పేరుతో కోతను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం

### - టీఆర్టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

**సారంగాపూర్, మే 31, ప్రభాతవార్త:**



స్పష్టమైన విధివిధానాలు ఖరారు కాకుండా, ఏ ఆసుపత్రుల్లో వైద్యం అందిస్తారో తెలియజేయకుండా ఆరోగ్య పథకం పేరుతో ఉద్యోగుల వేతనాల నుండి 1.5 శాతం కోత విధించడాన్ని తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ తీవ్రంగా ఖండిస్తోందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు దర్శనం దేవేందర్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉద్యోగ సంఘాలతో చర్చలు పూర్తి కాకుండా, ఇప్పటివరకు ఇంకా ఉద్యోగులు ఆరోగ్య పథకంలో చేరకముందే ప్రభుత్వం ఆగమేఘాల మీద కోత విధించడం సరికాదన్నారు. ఆరోగ్య పథకానికి సంబంధించిన కార్డులు జారీ చేయకుండా, పథకం పరిధిలోకి ఎన్ని ఆసుపత్రులు వస్తాయో చెప్పకుండా, ఏ ఏ కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఎలాంటి చికిత్సలు అందిస్తారనే సమగ్ర సమాచారం ఇవ్వకుండా అకస్మాత్తుగా ఈ నిర్ణయం తీసుకోవడం సమంజసం కాదని పేర్కొన్నారు. ఈ విషయమై ప్రభుత్వం తొందరపాటు నిర్ణయాలు తీసుకోకుండా, అన్ని ఉద్యోగ సంఘాలతో చర్చించి సరైన విధానాలు అవలంబించాలని కోరారు. ఒకవేళ ప్రభుత్వం తప్పుడు నిర్ణయాలతో ముందుకు వెళ్తే పెద్ద ఎత్తున ఉద్యమించడానికి కూడా వెనుకాడేది లేదని హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉద్యోగుల వేతనాల నుండి కోత విధించే నిర్ణయాన్ని తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేశారు.

## దేశ సేవకు మరో అడుగు...

### - అగ్నివీర్‌కు మండల వాసి ఎంపిక

**ఆసిఫాబాద్ టౌన్, మే 31, ప్రభాతవార్త :**



ఆసిఫాబాద్ మండల కేంద్రానికి చెందిన శ్రీమంతుల శైలజ వేణుగోపాల్ కుమారుడైన శ్రీమంతుల క్రాంతి కిరణ్ అగ్ని వీర్ కు ఎంపికయ్యాడని ఆదివారం కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.. గత ఏడాది నవంబర్ 10 నుంచి 22 వరకు హనుమకొండలోని జవహర్లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగిన ర్యాలీలో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచాడని, శుక్రవారం రాత్రి ఫలితాలు విడుదల కావడంతో అగ్ని వీర్ కు ఎంపికయ్యాడని తెలిపారు. దీంతో కుటుంబంలో ఆనంద వాతావరణం నెలకొంది. చిన్ననాటి నుంచే దేశ సేవపై ఆసక్తి కలిగిన అతడి కఠిన శ్రమ, పట్టుదలతో అగ్నివీర్ నియామక పరీక్షల్లో విజయాన్ని సాధించారని హర్షం వ్యక్తం చేశారు. అగ్నివీర్ పథకం ద్వారా భారత సాయుధ దళాల్లో సేవ చేసే అవకాశం రావడం గర్వకారణమని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. మండలానికి చెందిన యువతకు ఇది ఆదర్శంగా నిలుస్తుందని తెలిపారు. యువకుడి విజయానికి సహకరించిన తల్లిదండ్రులను స్థానిక ప్రజలు అభినందించారు. క్రాంతి కిరణ్ స్థానిక మోడల్ స్కూల్లో పదవ తరగతి వరకు చదివి కరీంనగర్లోని ఢిల్లీ డిఫెన్స్ అకాడమీ లో ఇంటర్ పూర్తి చేశాడు. ప్రస్తుతం వరంగల్ లోని కాకతీయ డిగ్రీ కాలేజీలో ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఈ సందర్భంగా యువకుడు మాట్లాడుతూ దేశానికి సేవ చేయడం తన కల అని, తనపై నమ్మకం ఉంచిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

## దత్తాత్రేయ ఆలయంలో పూజలు చేసిన ఎమ్మెల్యే

**భైంసా, మే 31, ప్రభాతవార్త:**



భైంసా మండలంలోని దేగం గ్రామంలో పౌర్ణమి సందర్భంగా వెలసిన శ్రీ దత్తాత్రేయ ఆలయంలో ముధోల్ శాసనసభ్యుడు పవార్ రామారావు పటేల్ ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆదివారం ఆలయాన్ని సందర్శించిన ఆయన స్వామివారిని దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో పుండలిక్ పాటిల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బండార (అన్నదానం) కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని భక్తులతో కలిసి ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి, వేదాశీర్వచనం అందించారు. నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో విలసిల్లాలని స్వామివారిని వేడుకున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో దేగం సర్పంచ్ సిరం సుష్మారెడ్డి, గ్రామ పెద్దలు, వివిధ నగరాల ప్రజాప్రతినిధులు, భక్తులు, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత ప్రారంభానికి ఏర్పాట్లు

### - సభా ప్రాంగణాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి

**బెల్లంపల్లి, మే 31, ప్రభాతవార్త**



సిర్పూర్ కాగజ్‌నగర్ పట్టణంలో నిర్వహించనున్న ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత ప్రారంభోత్సవ కార్యక్రమానికి జిల్లా యంత్రాంగం విస్తృతంగా ఏర్పాట్లు చేపడుతోంది. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో జరగనున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కృషి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కొత్తరి గ్రామంలోని ఎక్స్ రోడ్ వద్ద ఏర్పాటు చేయనున్న సభా ప్రాంగణాన్ని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి, రాష్ట్ర మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావుతో కలిసి ప్రత్యక్షంగా పరిశీలించారు. సభా ప్రాంగణంలో జరుగుతున్న పనులను సమీక్షిస్తూ, కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరవుతారని భావించి తగిన విధంగా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ప్రత్యేకంగా ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, నీడ ఏర్పాట్లు, పార్కింగ్ సదుపాయాలు, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా చర్యలు, వైద్య సదుపాయాలు వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులను ఆదేశించారు. సభా ప్రాంగణానికి వచ్చే మార్గాల్లో రహదారులను శుభ్రపరచి సక్రమంగా నిర్వహించాలని, అలాగే వేదిక నిర్మాణం, సౌండ్ సిస్టమ్, విద్యుత్ సరఫరా వంటి పనులు సమయానికి పూర్తి చేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా లబ్ధిదారులకు ఇళ్లు అందించడం ప్రభుత్వ సంకల్పమని, ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు మరింత విశ్వాసం కలుగుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ముఖ్యమంత్రి పాల్గొనే ఈ సభను ఘనంగా నిర్వహించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విటల్, జిల్లా డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, జిల్లా కలెక్టర్ హరిత, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి సభకు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నాయకులు ప్రజలకు పిలుపునిచ్చారు.

## సింగరేణి ఉత్తమ ఉద్యోగులుగా శశాంక్, మోహన్ దాస్

### - మంగళవారం అవార్డుల ప్రదానం

**నస్పూర్, మే 31, ప్రభాతవార్త**






తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకల సందర్భంగా సింగరేణి శ్రీరాంపూర్ ఏరియాకు చెందిన ఇద్దరు ఉద్యోగులు ఉత్తమ అవార్డులకు ఎంపికయ్యారు. ఆర్.కె 7 భూగర్భగని సీనియర్ అండర్ మేనేజర్ ఎం. శశాంక్ ఏరియా స్థాయి ఉత్తమ ఉద్యోగిగా గుర్తింపు పొందారు. ఎస్సార్పీ 3 గని హెడ్ ఓవర్మెన్ బోగె మోహన్ దాస్ కంపెనీ స్థాయి ఉత్తమ ఉద్యోగిగా ఎంపికయ్యారు. మంగళవారం శ్రీరాంపూర్ ప్రగతి స్టేడియంలో జరిగే వేడుకల్లో శశాంక్ ను ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ సత్కరిస్తారు. కంపెనీ స్థాయి అవార్డుకు ఎంపికైన బోగె మోహన్ దాస్ కొత్తగూడెంలో జరిగే ప్రధాన వేడుకల్లో సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ చేతుల మీదుగా పురస్కారం అందుకోనున్నారు. ఉత్తమ ఉద్యోగులుగా ఎంపికైన ఇరువురికి ఏరియా అధికారులు, మైనింగ్ సిబ్బంది, తోటి కార్మికులు శుభాకాంక్షలు తెలిపారు.

## బెల్లంపల్లిలో గాలివాన బీభత్సం

### - బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

**బెల్లంపల్లి, మే 31, ప్రభాతవార్త**

బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలో ఆదివారం రోజున సాయంత్రం కురిసిన ఈదురు గాలులు, వర్షాల ప్రభావంతో ఓ ఇంటి పైభాగంలో ఉన్న రేకులు గాలికి ఎగిరిపడి కింద పడిన ఘటన చోటుచేసుకుంది. ఈ ఘటనతో స్థానికంగా కలకలం రేగింది. ఈ విషయం తెలిసిన వెంటనే బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి ఘటన స్థలానికి చేరుకుని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి పరిస్థితిని తెలుసుకుని ధైర్యం చెప్పారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని ఎమ్మెల్యే తెలిపారు. అయినప్పటికీ, ఇల్లు దెబ్బతిన్నందున బాధిత కుటుంబానికి తక్షణ సహాయం అందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి, బాధితులకు అవసరమైన సహాయం త్వరగా అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు అండగా ఎల్లప్పుడూ ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పన్ దావ స్వాతి రమేష్ బాబు, స్థానిక వార్డు కౌన్సిలర్, ఇతర ప్రజాప్రతినిధులు మరియు నాయకులు పాల్గొన్నారు.





## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

### 20 ఏళ్ల తర్వాత కలిసిన సహపాఠులు - గురువులకు ఘన సన్మానం

**వేమనపల్లి, మే 31, ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2004-05 విద్యా సంవత్సరానికి చెందిన 10వ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. దాదాపు 20 సంవత్సరాల తర్వాత ఒకే చోట కలుసుకున్న పూర్వ విద్యార్థులు తమ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పాఠశాల రోజుల్లోని అనుభవాలు, స్నేహితులతో గడిపిన మధుర క్షణాలను గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం తమలో కొందరు ప్రభుత్వ ఉద్యోగాలు, మరి కొందరు ప్రైవేటు రంగాల్లో స్థిరపడి ఉన్నట్లు తెలిపారు. ఇలాంటి సమావేశాలు స్నేహబంధాలను మరింత బలోపేతం చేస్తాయని, ప్రతి సంవత్సరం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించాలని నిర్ణయించుకున్నట్లు పేర్కొన్నారు. తమకు విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అనారోగ్య బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

**వేమనపల్లి, మే 31, ప్రభాతవార్త**



బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి ఆదేశాల మేరకు వివిధ గ్రామాలకు చెందిన 8 మంది అనారోగ్య బాధితులకు రూ.3 లక్షల విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మాజీ జడ్పీటీసీ సభ్యులు ఆర్. సంతోష్ కుమార్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులతో పాటు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న పేద కుటుంబాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీసీ జనరల్ సెక్రటరీ గాలి మధు, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముల్కల్ల సత్యనారాయణ, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు చెన్నూరి సమ్మయ్య, సర్పంచ్ లు వుప్పలపు సాయికృష్ణ, కొట్రంగి శ్రీనివాస్, మడే శ్రీనివాస్, దుర్గం భాగ్యలక్ష్మి-తిరుపతి, ఆలం లక్ష్ముమ్మన్, ఎనగంటి మల్లేశ్వరి-శేఖర్ రెడ్డి, ముల్కల్ల శ్రీలత-సత్యనారాయణతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.